క్లుప్తంగా

ధర్మరక్షణకే కంసవధ



నెల్లూరు(బృందావనం): ధర్మ రక్షణకే శ్రీకృష్ణుడు కంసుడిని వధించాడని శతావధాని కొండెపి మురళీకృష్ణ తెలిపారు. పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో జరుగుతున్న 'శ్రీకృష్ణ కథామృతం' భాగవత సప్తాహంలో భాగంగా ఆరో రోజు సోమవారం 'కంస వధ' అంశంపై ఆయన ఉపన్యసించారు. అక్రూరుని భక్తి, కురూపి కుబ్జసేవ తదితర విషయాలను వివరించారు. సభా పోషకులుగా అన్నవరం సత్యనారాయణ వ్యవహరించారు. అనంతరం కొండెపి మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు.

జోజి సేవలు ఎనలేనివి



నెల్లూరు (టౌన్): అధ్యాపకులుగా జోజి ఎనలేని సేవలు అందించారని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన జోజిని సహచర అధ్యాపకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జోజీ అధ్యాపక వృత్తితో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ రమణయ్య, ఎమీల్యమ్మ, అధ్యాపకులు రాంబాబు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రసాద్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మహావిష్ణు కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలోని మహాలక్ష్మి, గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గురువాయూర్ మహావిష్ణువు ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా గంటా రమణయ్య నాయుడు, ప్రమీల దంపతులు వ్యవహరించారు. వార్షిక బ్రహ్మోత్సవాల పరిసమాప్తం సందర్భంగా మంగళవారం ఉదయం 8 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 4.30 గంటలకు పుష్పయాగం, రాత్రి 8గంటలకు ధ్వజావరోహణం నిర్వహించనున్నట్లు స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి వెంకటరత్నం తెలిపారు.

డాక్టర్ జ్యోతి మరణం బాధాకరం

నెల్లూరు(అర్బన్): చేజర్ల మండలం చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నంబూరి జ్యోతి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మెడికల్ సర్వీసెస్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యశాఖలో మంచి పేరు కలిగిన జ్యోతి జాతీయ వైద్యుల దినోత్సవం నాడు మృతి చెందడం అత్యంత విషాదకరమన్నారు. తొందరపాటులో తీసుకునే నిర్ణయాలు కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని, వేదనను మిగులుస్తాయన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపాన్ని ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైద్యుల సంఘం సంతాపం

ఎంతో భవిష్యత్తు ఉన్న డాక్టర్ జ్యోతి అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమె మృతిపై తన సంతాపాన్ని ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య, సమగ్రశిక్ష, ఆధ్వర్యంలో రోటరీ క్లబ్, యూనివర్సిటీ ఆఫ్ మెల్బోర్న్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కెరీర్ గైడెన్స్‌పై తరగతులను నగరంలోని అవెన్యూ స్కూల్‌లో సోమవారం నిర్వహించారు. జిల్లాలోని 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు ఈ తరగతులు నిర్వహించారు. డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, స్టేట్ అబ్జర్వర్ శారదాకుమారి, గ్లోబల్ ఎడ్యుకేషన్ సొసైటీ సీఈఓ రాక్వెల్ శరఫ్, డీవీఈఓ మధుబాబు, ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు దైవంతో సమానం



వైద్యుడ్ని సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

కోవూరు: వైద్యులు దైవంతో సమానమని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎస్ నరసింహమూర్తి పేర్కొన్నారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న 13 మంది వైద్యులను శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ సమాజంలోని అన్ని మతాల వారికి ఆరోగ్య విషయంలో మాత్రం వైద్యుడు దేవుడితో సమానమన్నారు. కరోనా సమయంలో వైద్యులు ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించారని కొనియాడారు. అటువంటి వైద్యులను ట్రస్టు ఆధ్వర్యంలో సన్మానించడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వెంకటాచలపతిగౌడ్ మాట్లాడుతూ మహనీయుడైన డాక్టర్ బిపిన్‌రాయ్ జయంతిని ఏటా జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకొంటున్నట్లు తెలిపారు. బిపిన్‌రాయ్ డాక్టర్‌గా అందించిన సేవలు ఎనలేనివన్నారు. అటువంటి మహనీయుడిని నేటి తరం వైద్యులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తొలుత డాక్టర్ బిపిన్‌రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పెద్ది హితేష్‌కుమార్, పెద్ది మారుతీతన్మయి, వేముల నిఖిల్ ఉనారు.

విలువలతో కూడిన విద్యాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్

ముత్తుకూరు: విలువలతో కూడిన విద్యాభివృద్ధికి అదానీ ఫౌండేషన్ కృషి చేస్తోందని అదానీ కృష్ణపట్నంపోర్టు కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జీ వేణుగోపాల్ అన్నారు. కృష్ణపట్నం పంచాయతీలోని ఆర్కాట్‌పాళెం అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లేక్లాస్, ఎల్‌కేజీ, యూకేజీ, ఇంగ్లిష్ మీడియం తరగతులను ప్రారంభించారు. ఉచితంగా పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అదానీ ఫౌండేషన్ కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, పోర్టు ప్రతినిధులు మృత్యుంజయరామ్, రమేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి పాల్గొన్నారు.

విద్య ప్రాథమిక హక్కు



నేడు బడికి పోతాపై అవగాహన ర్యాలీ

కొడవలూరు: చదువుకోవడం బాలల హక్కు అని, ఆ హక్కును కాలరాసే అధికారం తల్లిదండ్రులకు కూడా లేదని హెచ్‌ఎం టీ రవీంద్ర అన్నారు. మండలంలోని గుండాలమ్మపాళెం గిరిజన కాలనీలో విద్యార్థులతో 'నేను బడికి పోతా'పై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే బంగారు భవిత లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి విధిగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఎక్కడైనా బడిఈడు పిల్లలు బడి బయట ఉంటే సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం లత, వీ కవిత, సీఆర్‌ఎంటీ పెంచలరావు పాల్గొన్నారు.

గ్రామీణులకు వరం ఫ్యామిలీడాక్టర్



కొడవలూరు: గ్రామీణులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరమని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం రామకృష్ణ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గుండాలమ్మపాళెంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణులకు చిన్నపాటి ఆరోగ్య సమస్యలు ఉన్నా గుర్తించి వెంటనే చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రరూపం దాల్చకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇంటి వద్దకే వైద్యులు వచ్చి వైద్య సేవలందించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయలక్ష్మి, హెచ్‌ఏ షఫీఉద్దీన్, హెచ్‌వీ సుజాత, ఆశాకార్యకర్త శైలజ పాల్గొన్నారు.

ఒత్తిడిని వీడి ఉల్లాసంగా గడపండి



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ, ఏఎస్పీలు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో ఎన్నో ఒత్తిళ్లు ఎదుర్కొన్న పోలీసు సిబ్బంది ఉద్యోగ విరమణ అనంతరం శేషజీవితాన్ని కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడపాలని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ సూచించారు. నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన పోలీసు సిబ్బంది ఉద్యోగ విరమణ సభలో ఎస్పీ పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన డీసీఆర్‌బీ, నవాబుపేట ఎస్సైలు కే శ్రీనివాసరావు, బీ శివప్రకాష్, వేదాయపాళెం, టీపీగూడూరు, వెంకటాచలసత్రం ఏఎస్సైలు ఎం కృష్ణయ్య, ఎన్ సుబ్బరాజు, ఆర్వీ రమణ, డీటీసీ హెచ్‌సీ ఎండీ షరీఫ్, ఏఆర్ హెచ్‌సీ జీ విజయానందాన్ని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు కే రామకృష్ణారెడ్డి, షఫీఅహ్మద్, వెల్ఫేర్, హోమ్‌గార్డు ఆర్ఐలు రాజారావు, నాగరాజు, ఆర్ఎస్సైలు, పోలీసు అధికారుల సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

4న విద్యా సంస్థల బంద్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరు (టౌన్): నీట్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈ నెల 4న జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్‌ను మళ్లీ నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రికి మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. నీట్ పేపర్ లీక్‌కు కారణమైన ఎన్డీఏ ప్రభుత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లాలోని విద్యాసంస్థలను స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు యాజమాన్యాలు సహకరించాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు శ్రీహర్ష, శివ, చరణ్, జీవన్, ప్రశాంత్, మస్తాన్‌షరీఫ్, పవన్‌కిషోర్, శివవర్మ, ఆకాష్, కిరణ్, నాగసాయి, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో భారీ వర్షం

పొదలకూరు: మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. మండలంలో 55.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. రెండ్రోజులుగా ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఈ క్రమంలో భారీ వర్షం కురిసి వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో కాస్తా ఉపశమనం పొందారు. కాగా వర్షానికి మరుపూరు చెరువులోకి స్వల్పంగా నీరు చేరినట్లు రైతులు తెలిపారు.

యూనిఫామ్ మంజూరు

ముత్తుకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్ మంజూరైనట్లు విద్యాశాఖ అధికారులు సోమవారం తెలిపారు. మండలంలోని 57 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 6 జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు ముత్తుకూరులోని గురుకుల పాఠశాల విద్యార్థులు మొత్తం 4,652 మందికి యూనిఫామ్‌తో పాటు బూట్లు, సాక్సులు, బెల్టులు, నోట్ పుస్తకాలు మంజూరయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం అందజేసిన స్కూల్ బ్యాగు మాత్రం మంజూరు కాలేదని వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



మనుబోలు: మండలంలోని చెర్లోపల్లి రైల్వేగేట్ సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో విశ్వనాథస్వామికి విశేష పూజలు నిర్వహించారు. విశ్వనాథస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అండగా ఉంటాం..అధైర్య పడొద్దు



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసన్న

- మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అన్ని విధాలా అండగా ఉంటామని, అధైర్య పడొద్దని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఇటీవల కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి ప్రహరీని కొందరు ధ్వంసం చేశారు. అలాగే ఆయన మోకాలి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణారెడ్డిని ప్రసన్న సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని, ప్రహరీ ధ్వంసానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రసన్న మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని కొందరు పనిగట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఆస్తులు ధ్వంసం చేయడం దారుణమని ఖండించారు. రాధాకృష్ణారెడ్డి ప్రహరీ ధ్వంసం ఘటనకు సంబంధించి జక్కంరెడ్డి భాస్కర్‌రెడ్డిపైన అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సమగ్రంగా విచారించి న్యాయం చేయాలని పోలీసులను కోరారు. తాను ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజాసమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు వారికి అండగా నిలబడాలన్నారు. ఆయన వెంట దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, నరసింహులురెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, వేణు, చిరంజీవి, యశ్వంత్‌రెడ్డి, రమేష్, శేఖర్‌స్వామి, జగదీష్, గయాజ్, దౌలత్, తదితరులు పాల్గొన్నారు

డెంగీ వ్యాధిని నివారిద్దాం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తదితరులు

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): డెంగీ వ్యాధిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని వైద్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ప్రభుత్వ బీఈడీ కళాశాల వరకు వైద్యశాఖ ఉద్యోగులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఏడిస్ ఈజిప్టు అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాధి వస్తుందన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డెంగీ కేసులు పెరిగే అవకాశం ఉందని, కొన్ని రకాల డెంగీ కేసులు ప్రాణాంతకమని తెలిపారు. ప్రజలు దోమలు కుట్టకుండా, ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు డెంగీ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని తెలిపారు. అనంతరం ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో డెంగీ నివారణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి, జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ, ఎన్‌సీడీ ప్రోగ్రామింగ్ అధికారి సుధీర్ కుమార్, డెమో అధికారి శ్రీనివాసరావు, ఏఎంఓ నాగార్జునరావు, ఆశా కార్యకర్తలు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా నిర్మూలనకు ముందస్తు చర్యలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్లను వైద్యాధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏ ప్రాంతంలో కూడా డయేరియా ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు జిల్లాలో డయేరియా నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ప్రధానంగా ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడకుండా ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఏఎన్‌ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి డయేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. ప్రతి ఇంట్లో రెండు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు అందజేస్తామని అన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, డయేరియాపై ప్రజలను అప్రమత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు డయేరియా నిర్మూలన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలి

- కలెక్టర్ ఎం హరినారాయణన్

వెంకటాచలం: మండలంలోని కనుపూరులో సోమవారం ఉదయం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ హరినారాయణన్ పర్యవేక్షించారు. గ్రామంలో సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేస్తుండగా వెళ్లి పరిశీలించి సూచనలు చేశారు. పింఛన్ల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

అన్ని వర్గాలకు అండగా నిలుస్తాం

వెంకటాచలం: టీడీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గొలగమూడి, తిక్కవరప్పాడు, సర్వేపల్లి, ఈదగాలి, ఇడిమేపల్లి గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులకు రూ.3 వేల నుంచి రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచి నగదు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీకి సర్వర్ సమస్య

పొదలకూరు: మండలంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి సర్వర్ సమస్యగా మారింది. మండలంలోని 30 పంచాయతీల్లో 10,143 మంది లబ్ధిదారులు ఉండగా, 218 మంది సచివాలయ ఉద్యోగులు, ఇతర శాఖల సిబ్బందిని కేటాయించారు. అయితే సర్వర్ సమస్యతో పింఛన్ల పంపిణీలో జాప్యం నెలకొంది. సోమవారం సాయంత్రానికి 86 శాతం పింఛన్లను మాత్రమే పంపిణీ చేశారు. మంగళవారం మిగిలిన వారికి పింఛన్లను పంపిణీ చేస్తామని ఎంపీడీఓ మహ్మద్ రఫీ తెలిపారు.



వెంకటాచలం: కనుపూరులో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

95 శాతం పింఛన్ల పంపిణీ

తోటపల్లిగూడూరు: మండలంలో తొలిరోజు 95 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసినట్లు ఎంపీడీఓ బాలాజీ తెలిపారు. మండలంలోని 22 పంచాయతీల పరిధిలో 7,544 మంది లబ్ధిదారులు ఉండగా , 7,134 మందికి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారని వివరించారు. మిగిలిన వారికి మంగళవారం అందజేయనున్నట్లు తెలిపారు.

మనుబోలు: మండలంలోని మడమనూరు, వీరంపల్లి, అక్కంపేట గ్రామాల్లో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో లబ్ధిదారులకు పెంచిన పింఛన్లను ఇంటి వద్దే అందజేస్తున్నామని తెలిపారు. బండేపల్లి బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓ మహిళ దివ్యాంగుడైన తన కుమారుడికి పింఛన్ అందించాలని కోరగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పింఛన్లను సకాలంలో పంపిణీ చేయాలి

కోవూరు/కొడవలూరు/బుచ్చిరెడ్డిపాళెం: పింఛన్లను సకాలంలో పంపిణీ చేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశించారు. కోవూరు మండలం పడుగుపాడు, పోతిరెడ్డిపాళెం, కోవూరు, బుచ్చిరెడ్డి రెడ్డిపాళెం మండలం దామరమడుగు,ఖాజానగర్, కొడవలూరు మండలం నార్తురాజుపాళెం, కొడవలూరులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్లను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మనుబోలు: వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న సర్వపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



పింఛన్ అందజేసి దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి